నూతన అటవీ చట్టం ముసాయిదా

# పర్యావరణానికి ప్రజలు శత్రువులా?

అడవుల మీద ప్రభుత్వ ఆధిపత్యం బ్రిటీష్ హయాంలో ప్రారంభమయింది. అంతకు ముందు అడవులలో బ్రతికే జనం సంప్రదాయక నియమాలకు లోబడి అటవీ సంపదను ప్రభుత్వం ప్రమేయం లేకుండ అనుభవించేవారు. అటవీ వాసులే వ్యవసాయం అలవరచుకొని అడవులను క్రమంగా సాగుభూమిగా మార్చడం , లేదా అప్పటికే వ్యవసాయం అలవరచుకున్న వాళ్లు అడవి భూములను ఆక్రమించుకొని అటవీవాసులను తరిమేసి (లేదా లోబరుచుకొని) అడవులను నాగలి కిందికి తేవడం, అనేక శతాబ్దాలుగా మన దేశంలో జరుగుతూ ఉంది.

పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థ వచ్చిన తరువాత అడవులకు కొత్త ప్రయోజనం వచ్చింది. అడవులు పరిశ్రమలకు ముడిసరుకు సరఫరా చేసే కేంద్రాలుగా గుర్తింపు పొందాయి. అడవులలోని ఖనిజాలు, కలప, పూలు, పండ్లు, ఆకులు వ్యాపారసరుకు లయ్యాయి. ఇవి వ్యాపారానికీ పరిశ్రమలకూ ఉపయోగపడాలంటే అడవుల మీద అటవీ పరిసర ప్రాంత ప్రజలకు ఉండే రకరకాల హక్కుల మీద పరిమితులు పెట్టడం అవసరం అవుతుంది. అటవీ సంపదను అనుభవించే హక్కు, అడవి భూమిని వ్యవసాయ భూమిగా మార్చేహక్కు రెండూ కూడా గతంలో లాగా కేవలం సంప్రదాయక పరిమితులకు లోనయి ఉండడం ఇకపైన సాధ్యం కాదు. వ్యాపార అవసరాల కోసం అడవులు ప్రభుత్వ యాజమాన్యం లోకి రావలసి ఉంటుంది. ప్రభుత్వం చట్టాల రూపంలో అటవీవాసుల హక్కులపైన పరిమితులు పెట్టడం అవసరం అవుతుంది. పోలీసుల లాగ ఖాకీ బట్టలు వేసుకున్న అటవీశాఖ ఒకటి పుట్టి ఆ చట్టాన్ని నిర్బంధంగా అమలు చేయవలసి ఉంటుంది.

1855 లో మొట్టమొదటిసారిగా బ్రిటీష్ ప్రభుత్వం అటవీ వాసుల హక్కులను నియంత్రించే రెగ్యులేషన్‌ను ప్రకటించింది. 1865 లో మొట్ట మొదటి భారత అటవీ చట్టం జారీ అయింది. చెట్లు లేక కంప ఉన్న ఏ భూభాగాన్నయినా ప్రభుత్వం అడవిగా ప్రకటించి, ఆ భూభాగం యాజమాన్యాన్ని తన చేతిలోకి తీసుకొని, దానికోసం నియమాలు నిర్దేశించ వచ్చునని ఈ చట్టం చెప్తుంది.

1878 లో భారత అటవీచట్టం మరికొంత సమగ్రరూపాన్ని తీసుకుంది. అడవులను (1) రిజర్వ్ అడవులు, (2) రక్షిత (ప్రొటెక్టెడ్) అడవులు (3) గ్రామీణవనాలు అని మూడుగా ఈ చట్టం విభజించి, మొదటి రెండు రకాల అడవులలో ప్రజల హక్కుల మీద నిర్దిష్టమైన ఆంక్షలు పెట్టింది. ఈ విభజన ఇప్పటికీ కొనసాగుతూ ఉంది. అడవులలోని కలపను తరలించే వారి మీద సుంకాలు వసూలు చేసి తద్వారా రెవెన్యూ పొందే విధానం ఈ చట్టంతో మొదలయింది. 1884లో బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటించిన అటవీ విధానం, అటవీ సంపద మీద సుంకాలు వసూలు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రాముఖ్యం ఇచ్చింది.

1927 లో భారత అటవీచట్టాన్ని చాలా సమగ్రంగా తిరగరాసారు. అదే ఈ నాటికీ కొనసాగుతూ ఉంది. 'అడవులు' అటవీ సంపద రవాణా కలప తదితర అటవీ సంపదల పైన విధించే సుంకాలు అనే మూడు విషయాలకు సంబంధించిన చట్టాలను క్రోడీకరించడం కోసం ఈ శాసనం ఉద్దేశించబడిందని శాసనం ప్రవేశిక చెప్తుంది. అడవుల వల్ల ప్రభుత్వానికి లభించే రెవెన్యూ ఆదాయానికి బ్రిటీష్ పాలకులు ఇచ్చిన ప్రాముఖ్యం ఇక్కడ మనకు అర్థం అవుతుంది.

1935 భారత ప్రభుత్వ చట్టంలోనూ 1950లో ఆమోదం పొందిన భారత రాజ్యాంగంలోనూ అడవులను కేంద్ర ప్రభుత్వ జాబితాలో కాక రాష్ట్ర ప్రభుత్వ జాబితాలో పెట్టారు. అందువల్ల మౌలికంగా దేశమంతటా 1927 అటవీచట్టమే అమలులో ఉన్నప్పటికీ ఒక్కొక్క రాష్ట్రంలోనూ ఆ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సవరణలు చట్టాన్ని కొంత మార్చాయి. కొన్ని రాష్ట్రాలు కొంత మేరకు ప్రజాస్వామ్య స్వభావంగల సవరణలు చేసాయి. గ్రామీణ వనాలకు, సంయుక్త వనాలకు (అంటే గ్రామస్తులు, అటవీశాఖ ఉమ్మడిగా నిర్వహించే అడవులకు) ప్రాధాన్యం ఇచ్చే చట్ట సవరణలు పశ్చిమ బెంగాల్, కర్నాటక, మహారాష్ట్రలలో జరిగాయి. ( బహుశా, ప్రజోపయోగమైన ఏ మార్పూ చేయనిది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమేనేమో)

అయితే 1976లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణ అడవులను రాష్ట్రాల జాబితానుండి తొలగించి ఉమ్మడి జాబితాలో పెట్టింది. 'ఉమ్మడి' జాబితా అప్పప్పుడు కేంద్ర పార్లమెంటుకూ రాష్ట్ర అసెంబ్లీకి రెండింటికీ ఆ విషయాలపైన చట్టాలు చేసే అధికారం ఉంటుంది. అయితే రెండింటి మధ్య అభిప్రాయభేదం ఉంటే కేంద్రం అభిప్రాయమే నిలుస్తుంది. కాబట్టి 1935లో కొంత వికేంద్రీకరణ పొందిన అటవీ విధానం 1976 తరువాత మళ్లీ కేంద్రీకృతమయింది.

42వ రాజ్యాంగ సవరణ ఎమర్జెన్సీ కాలంలో ఇందిరాగాంధీ ప్రభుత్వం చేపట్టిన నియంతృత్వ చర్యలలో ఒకటి. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత అధికారంలోకి వచ్చిన జనతాపార్టీ ప్రభుత్వం 44వ రాజ్యాంగ సవరణద్వారా 42వ రాజ్యాంగ సవరణ లోని కొన్ని నియంతృత్వ స్వభావంగల అంశాలను తొలగించింది. అయితే 'అడవులను' తిరిగి రాష్ట్రాల జాబితాలో పెట్టలేదు. అది ఉమ్మడి జాబితాలోనే ఉండిపోయింది.

1980 లో ఇందిరాగాంధీ రెండవసారి దేశ ప్రధాన మంత్రి అయిన తరువాత, అడవులను రాష్ట్రాల జాబితానుండి తీసేసి కేంద్ర అజమాయిషీలో (ఉమ్మడి జాబితాలో) పెట్టడంలో గల ఉద్దేశ్యాన్ని స్పష్టం చేసింది. ప్రభుత్వ అటవీ విధానంలోనే మౌలికమయిన మార్పులు చేసే కొత్త అటవీ చట్టాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నం చేసింది. అప్పటివరకు దేశ అటవీ విధానం 1952 నాటి విధానతీర్మానాన్ని అనుసరించి ఉండింది. ఈ తీర్మానం అడవుల యాజమాన్యంలో ఉన్న మూడు అవసరాలకూ సమానప్రాముఖ్యం ఇచ్చింది. ఒకటి పర్యావరణ సంరక్షణ, రెండు స్థానిక ప్రజల అవసరాలు తీర్చడం, మూడు పారిశ్రామిక ప్రయోజనాలు సమకూర్చడం.

అడవుల నాశనం జలవనరులను అనేక రూపాలలో దెబ్బతీస్తుంది. వర్షపాతం తగ్గిపోవడం ఒక అంశం. అయితే అదొక్కటేకాదు. చాలా నదులకు నీరు కొండల మీద కురిసే వర్షం నుండి వస్తుంది. కొండ చరియలలోని అడవులు నాశనం అయితే నీరు నదులలోకి వేగంగా కొట్టుకొని పోతుంది. కొండ చరియలలోని మట్టి అంతా కొట్టుకొనిపోయి నదుల గర్భంలో కలిసి నదీగర్భం నేలమట్టాన్ని పెంచుతుంది. ఈ రెండూ వరదలకు దారితీస్తాయి. వరదల వల్ల ప్రత్యక్ష నష్టం జరగడమే గాక నదీజలాలు వృధా కూడ అవుతాయి.

కొండలోయలలోనే కాక మైదానంలో ప్రవహించే నదుల ఒడ్డున వున్న అడవులను, చెట్లను కాపాడడం కూడ అవసరం. లేకపోతే నదుల ఒడ్డు స్థిరత్వాన్ని కోల్పోవడమేకాక ఒడ్డున ఉన్న మట్టి నదీ గర్భంలో కలిసిపోయి వరదలకు హేతువు అవుతుంది. అదేవిధంగా, సముద్రతీరంలోని అడవులు, చెట్లు నాశనం అయితే తీర ప్రాంతపు ఇసుక లోతట్టుకు వ్యాపించి భూసారాన్ని నష్టం చేస్తుంది. తుఫానుల తాకిడి కూడ ఎక్కువ అవుతుంది.

అడవుల సంరక్షణకు ఉండే ఈ పర్యావరణ ప్రయోజనాన్ని 1952 తీర్మానం గుర్తించింది. అదే విధంగా ప్రజలకు వంట చెరకు, నాగళ్లు తయారు చేసుకొవడానికి అవసరమయ్యే కర్ర, పశుగ్రాసం, తదితర అవసరాలను అడవులు సమకూర్చాలని కూడ ఆ తీర్మానం గుర్తించింది. చివరిగా కాగితం తదితర పరిశ్రమలకు, గృహనిర్మాణానికీ కుర్చీలు బల్లలు వంటి గృహావసరాలకు, రైల్వే స్లీపర్లకు కర్ర కలప కావాలని గుర్తించింది.

ఈ మూడు ప్రయోజనాలనూ తీరుస్తూ, వాటికి భంగం కలిగించని విధంగా ప్రభుత్వానికి వీలయినంత ఎక్కువ రెవెన్యూ సమకూర్చేటట్లు అటవీ విధానాలు ఉండాలని 1952 నాటి విధాన తీర్మానం అవింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాడు ప్రభుత్వం చేసిన అన్ని విధాన తీర్మానాలలోనూ ఈ మాత్రం ప్రజాతంత్ర స్పృహ ఉండింది.

అయితే, అన్ని రంగాలలాగ అటవీ రంగంలోనూ స్వతంత్ర భారత ప్రభుత్వ విధావ తీర్మానాలు ఏవయినా చట్టాలు, శాసనాలు పాతవే. 1927 అటవీ చట్టమే అటవీ విధానాన్ని శాసించింది. దానిని అమలు చేసిన దృక్పథం అన్ని రంగాలలాగ అటవీ రంగంలోనూ అప్రజాస్వామికమే. పారిశ్రామిక అవసరాలు, ప్రజల అవసరాలు, పర్యావరణ అవసరాలు మూడూ ముఖ్యమేనని విధానతీర్మానం చెప్పినా ఆచరణలో మొదటిది ముఖ్యం, రెండవది న్యూసెన్స్, మూడవది చాదస్తం అయింది. పరిశ్రమలు, నగరాలలో భవంతులు, అందమైన ఫర్నిచర్, ఇవన్నీ ప్రగతికి చిహ్నాలు. కానీ స్థానిక ప్రజలకు అవసరమైన పశుగ్రాసం, వంటచెరకు, ఇంటికర్ర దేశ ప్రగతిలో భాగంగా కనిపించవు. పోడు వ్యవసాయం అసలే కనిపించదు. ఇదంతా అటవీ శాఖను చికాకు పెట్టే న్యూసెన్స్. ఇంక పర్యావరణం ఎవరికీ తక్షణ సమస్యగా కనిపించదు. అది గాంధీ సూక్తుల వంటి ఒక చాదస్తపు ఆదర్శం.

కాబట్టి ఆచరణలో ఏం జరిగిందంటే రిజర్వ్ అడవులు పెరిగాయి. ప్రజలపైన ఆంక్షలు పెరిగాయి. అడవుల నుండి ప్రజల గెంటివేత పెరిగింది. జుర్మానాలు పెరిగాయి. వాటికంటే ఎక్కువగా లంచాలు పెరిగాయి. మరొక వైపు ప్రభుత్వం రిజర్వ్ అడవులలో కలపను కారుచవగ్గా పరిశ్రమలకు సరఫరా చేయసాగింది. పట్టణవాసుల గృహావసరాల కోసం కలప అధికారిక అమ్మకమే కాక స్మగ్లింగ్ కూడా బాగా పెరిగింది. దాదాపు ప్రతీ టింబర్ డిపో ఒక కలప స్మగ్లింగ్ కేంద్రం అయింది. దీని వల్ల, స్థానిక ప్రజల అవసరాల వల్ల, ఖాళీ అయిపోయిన అడవులను పునరుద్ధరించడానికి ప్రభుత్వం ఏమీ చేయలేదు. వ్యాపార లాభాలు, రెవెన్యూ తెచ్చిపెట్టే టేకు వంటి ప్లాంటేషన్లు మాత్రం విస్తృతంగా వేసింది.

ఆచరణలో 1950ల నుండి సాగుతున్న ఈ ప్రజావ్యతిరేక విధానానికి శాసన రూపం, విధాన రూపం ఇచ్చే ప్రయత్నం 1980 లో జరిగింది. ముఖ్యంగా అడవుల పరిసరాలలో బ్రతికే స్థానిక ప్రజల అవసరాలను గట్టిగా దెబ్బతీసి అటవీ సంపదను మొత్తంగా వ్యాపార, పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించే ప్రయత్నం 1980 లో కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన అటవీ బిల్లులో జరిగింది. స్థానిక ప్రజలు అడవులను నాశనం చేశారేతప్ప వాటిని పునరుద్ధరించడానికి ఏమీ చేయలేదనీ, వాళ్లకు కావలసినంత అటవీ సంపద ఉచితంగా సరఫరా చేస్తూ కూర్చోవడం దేశానికి నష్టకరమనీ జాతీయ వ్యవసాయ కమిషన్ అంతకు ముందు వ్యక్త పరచిన అభిప్రాయానికి ఈ బిల్లు చట్టరూపం ఇచ్చే ప్రయత్నం చేసింది. అయితే అదృష్టవశాత్తు ఈ బిల్లుకు వ్యతిరేకంగా వివిధ ప్రజాతంత్ర సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు తీవ్ర నిరసన తెలపడంతో కేంద్ర ప్రభుత్వం దానికి శాసన రూపం ఇచ్చే ప్రయత్నాన్ని విరమించుకుంది.

## జాతీయ అటవీ విధానం (1988)

అడవుల వల్ల స్థానిక ప్రజలకు ఉండే తక్షణ ప్రయోజనాలు, అడవుల సంరక్షణ వల్ల స్థానిక ప్రజలకే కాక మొత్తంగా సమాజానికి ఉండే దీర్ఘకాలిక ప్రయోజనాలు అనే రెండు అంశాల గురించి ఈ మధ్య కాలంలో బాగా ఆందోళన పెరిగింది. ఇందులో మొదటి అంశాన్ని గురించి వివిధ ప్రజాసంఘాలు, ప్రజా ఉద్యమాలతో బాటు ప్రజాతంత్ర భావాలు గల మేధావులు కూడ ప్రభుత్వంమీద ఒత్తిడి పెడుతుండగా, రెండవ అంశాన్ని గురించి వీరితోపాటు ప్రపంచబ్యాంకు వంటి ప్రపంచ పెట్టుబడిదారీ ప్రతినిధి సంస్థలు కూడ ఈ మధ్యకాలంలో ఒత్తిడి పెంచాయి. పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థ తన అవంతమైన లాభాల వేటలో పాశ్చాత్యదేశాలలో వినియోగదారుల అవసరాలను విపరీతంగా పెంచుతూ ఆ అవసరాలను తీర్చడం కోసం ప్రకృతి సిద్ధమైన వనరులనూ, ప్రాకృతిక పరిసరాలనూ, పర్యావరణాన్నీ విపరీతంగా ధ్వంసం చెసింది. ఇప్పుడు చాలా ఆలస్యంగా మేలుకొని పర్యావరణాన్ని సంరక్షించవలసిన అవసరానికి ప్రాముఖ్యం ఇస్తూ ఉంది. అందులో భాగంగా అన్ని దేశాలూ తమ భూభాగంలో మూడవ వంతు అడవులు ఉండేటట్టు చూడాలని ప్రపంచబ్యాంకు తదితర సంస్థలు ఆదేశిస్తున్నాయి.

అన్నిరకాల ఒత్తిడులూ కలిసి మన ప్రభుత్వ అటవీ విధానాన్ని కొంత మేరకు మెరుగు పరిచాయి. వ్యాపార అవసరాలకూ రెవెన్యూ అవసరాలకూ ద్వితీయ స్థానం ఇచ్చి స్థానిక ప్రజల (ముఖ్యంగా ఆదివాసీల) అవసరాలకూ పర్యావరణానికీ ప్రథమస్థానం ఇచ్చేదిగా ప్రభుత్వ అటవీ విధానాన్ని ఇవి



మార్చగలిగాయి. అయితే ప్రజలను అటవీ సంరక్షణకు శత్రువులుగా చూసే వైఖరి, అటవీ విధానం అమలు కోసం కేంద్రీకృత నిర్బంధ చర్యల మీద, అధికార యంత్రాంగం మీద ఆధారపడే వైఖరి కొనసాగడం వల్ల అటవీ విధానంలో పొడచూపుతున్న ప్రజాతంత్ర లక్షణాలు చివరికి ప్రజలమీద నిర్బంధం పెంచి అడవులను మాత్రం కాపాడే విధానంగా పరిణమించే ప్రమాదం ఉంది. 1988లో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన కొత్త జాతీయ అటవీ విధానాన్ని, దాని ఫలితంగా 1927 నాటి భారత అటవీ చట్టం స్థానంలో నూతనంగా ప్రవేశపెడుతున్న కొత్త అటవీ చట్టం మసాయిదాను పరిశీలించిన అనుభవజ్ఞులంతా ఇదే సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కొత్త జాతీయ అటవీ విధానం క్షీణించిన అటవీ సంపదను కాపాడడం, పెంపొందించడం, నదుల పరీవాహక ప్రాంతాలలో అడవులు పెంచడం, భూసారం క్షీణిస్తున్న ప్రాంతాలలో అడవులు పెంచడం, వన్య ప్రాణి జాతులను కాపాడడం కోసం అడవులను కాపాడడం తన లక్ష్యంలో ప్రథమ విషయాలుగా ప్రకటించింది. దీని కోసం పెద్ద ఎత్తున అటవీ పునరుద్ధరణ కార్యక్రమాలు అటవీ కరణ కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించింది. దేశం మొత్తంమీద మూడవ వంతు భూ భాగాన్ని, కొండ ప్రాంతాలలో మూడింట రెండు వంతుల భూభాగాన్ని అడవులుగా మార్చాలని తీర్మానించింది. గ్రామీణ ప్రజలకు ఆదివాసులకు అవసరమైన వంటచెరకు, పశుగ్రాసం, ఇతర అటవీ ఉత్పత్తులు, చవక రకం కలప అడవులనుండి తగు మోతాదులలో లభించేటట్లు చూడడం తన రెండవ లక్ష్యంగా తీర్మానించింది. అడవుల ఉత్పాదనలను పెంచడం, అటవీ ఉత్పత్తులను పెంచడం, కలప స్థానంలో ఇతర పదార్థాలను ఉపయోగించే విధానాలను అన్వేషించడం తన మూడవ లక్ష్యంగా తీర్మానించింది. ఈ మూడు లక్ష్యాల సాధన కోసం, అడవుల మీద మానవ అవసరాల ఒత్తిడిని తగ్గించడం కోసం, ప్రజాబాహుళ్యాన్ని ముఖ్యంగా స్త్రీలను సమీకరించి ఉద్యమ రూపంలో కార్యాచరణ రూపొందించడం తన ఆఖరి లక్ష్యంగా తీర్మానించింది. ప్రత్యేకించి, అడవులలో నివసించే ఆదివాసులను అడవుల సంరక్షణలో, పెంపుదలలో భాగస్వాములు చేయాలని, మైదాన గ్రామాలతో సమంగా అటవీ గ్రామాలను అభివృద్ధి చేయాలనీ అంటుంది.

పరిశ్రమల మాటకొస్తే, అటవీ ఉత్పత్తులను ముడిసరుకుగా ఉపయోగించే పరిశ్రమలు వీలయినంత మేరకు తమకు అవసరమైన ఉత్పత్తులను తామే పెంచుకోవాలనీ, అటవీ ఉత్పత్తులమీద ఆధారపడిన ఫ్యాక్టరీకయినా ఖచ్చితంగా ముడి సరుకు అందుతుందన్న భరోసా ఉంటేనే అనుమతి ఇవ్వాలనీ, అటువంటి ఫ్యాక్టరీలు స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడమే కాక ముడి సరుకు ఉత్పత్తి చేసే కార్యక్రమంలో స్థానిక రైతులకు భాగస్వామ్యం కల్పించాలనీ, ఒక ఫ్యాక్టరీకి ముడి సరుకు సరఫరా చేయడం కోసం స్థానిక ప్రజల అవసరాలను ఎట్టి పరిస్థితిలోనూ త్యాగం చేయకూడదనీ, ఫ్యాక్టరీలకు అవసరమయిన ముడిసరుకును బంజరుభూమిలో పెంచేందుకు రైతులను, ప్రత్యేకించి చిన్న రైతులను ప్రోత్సహించాలనీ, అయితే అటవీ శాఖ కూడ బంజరుగా మారిపోయిన అటవీ భూభాగంలో అటువంటి పెంపకం చేపట్టనచ్చునవీ, ఫ్యాక్టరీలకు అటవీ ముడిసరుకు చవకగా సరఫరాచేసే అలవాటు మానుకోవాలనీ, కలపను దిగుమతి చేసుకోవడాన్ని ప్రోత్సహించాలనీ, కలపవాడకం తగ్గించి ప్రత్యామ్నాయ ముడి సరుకును వాడడాన్ని ప్రోత్సహించాలనీ ఈ నూతన అటవీ విధానం అంటుంది.

అడవులను కాపాడాలి. చెట్లు, అడవులు విస్తృతంగా పెంచాలి. దీనిలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించాలి. అటవీ ప్రాంతంలో నివసించే ఆదివాసీ ఇతర గ్రామీణ ప్రజానీకానికి అవసరమైన వంటచెరకు, పశుగ్రాసం, ఇంటికర్ర మొదలైన అటవీ సంపద వాళ్లకు తగుమోతాదులో అందేటట్లు చూడాలి. ఈ రెండు లక్ష్యాలకు ఇబ్బంది కలగని మేరకు మాత్రమే వర్తక పారిశ్రామిక అవసరాలకు అడవులను వినియోగించాలి. ఇదీ కొత్త అటవీ విధానం.

ఇంతకంటే ఎవరయినా కోరుకునేది ఏముంటుంది? ప్రజా ఉద్యమాలు, ప్రజాతంత్రవాదులు ఇంతకంటే ఏం కోరుకోగలరు అనిపించవచ్చు ఈ విధానాన్ని చూస్తే. కానీ ఈ విధానంలో పేర్కొన్న వివిధ లక్ష్యాల మధ్య వైరుధ్యం తలెత్తితే అప్పుడేం చేస్తారు, లేకపోతే ఈ విధానానికీ ప్రస్తుతం దేశంలో ఉన్న సామాజిక ఆర్థిక వ్యవస్థకూ మధ్య వైరుధ్యం తలెత్తితే అప్పుడేం చేస్తారు అన్న ప్రశ్నలు వేసుకుంటే ఈ విధానంలోని లోపాలు కనిపిస్తాయి. ఒక విధానాన్ని ప్రకటించినప్పుడు దానిలోని విభిన్న అంశాల మధ్యనున్న వైరుధ్యం కనపడదు. ఆ విధానానికి శాసన రూపం ఇచ్చే చట్టాన్ని తయారు చేసినప్పుడు కొన్ని వైరుధ్యాలు బయటికొస్తాయి. దానిని ఆచరణలో పెట్టినప్పుడు అన్నీ బయటికి వస్తాయి.

ఉదాహరణకు అటవీప్రాంత ప్రజల అవసరాలు తీర్చడానికి అడవులు ఉపయోగపడాలన్నారు. ఇది మంచి ఆలోచనే. ప్రజలను అటవీసంరక్షణకు శత్రువులుగా చూసే ప్రస్తుత వైఖరికంటే మెరుగయినదే. అయితే అడవులనుండి ప్రజలు కోరుకునేది పశువులకు గడ్డి, ఇంటికి దూలాలు, నాగలికి కర్ర, చిల్లర పైసలకోసం తునికాకు మాత్రమే కాదు. వ్యవసాయానికి భూమి కావాలని కూడ కోరుకుంటారు. అయితే అడవుల రక్షణకూ దీనికీ పొసగదు. అప్పుడేం చేస్తారు? పోడు వ్యవసాయం గురించి పైన పేర్కొన్న విధాన పత్రమే జవాబును స్పష్టం చేస్తుంది. పోడువ్యవసాయాన్ని విస్తరించనీయరాదనీ, ఇప్పటికి జరుగుతున్న పోడువ్యవసాయాన్ని మాన్పించే ప్రయత్నం చేయాలనీ నూతన అటవీ విధానం అంటుంది. ఈ 'మాన్పించే ప్రయత్నం' అనేదానికి చట్టరూపం యిచ్చి అటవీశాఖ అధికార్లకు పోలీస్ అధికారాలూ, సివిల్ కోర్టు మేజిస్ట్రేట్‌కు ఉండే అధికారాలు ఇచ్చి నప్పుడు దాని అసలు స్వరూపం అర్థం అవుతుంది. పోడువ్యవసాయాన్ని పోనీయండి. స్థిరవ్యవసాయం కోసం అడవి కొట్టుకుంటామని అటవీవాసులూ ఆదివాసులూ ఆశపడి ముందుకొస్తే అప్పుడేం చేస్తారు? ఎవరినీ అడగకుండా అడవినరికి పంటవేసి పట్టాఇమ్మని అడిగితే అప్పుడేం చేస్తారు? ఏంచేస్తారో అటవీవిధానంలో చెప్పలేదు. దానికి కార్యరూపం ఇచ్చే చట్టంలో చెప్పారు.

అదేవిధంగా, అటవీ సంరక్షణకు భంగంకలగకుండ, అటవీవాసుల ప్రయోజనాలకు భంగం కలగకుండ ఉంటేనే పారిశ్రామిక రంగానికి అటవీ ఉత్పత్తులను ముడిసరుకుగా ఇస్తాననడం బాగుంది. కానీ ఈ ప్రకటనకూ ప్రస్తుతం దేశంలో నడుస్తున్న ఆర్థిక విధానానికీ పొంతన ఉందా? దేశంలో పట్టణీకరణ పెరుగుతూ ఉంది. పట్టణాలలో మామూలు ఇళ్ళేకాక పెద్దపెద్ద భవంతుల నిర్మాణం పెరుగుతూ ఉంది. గృహోపకరణాల అవసరం పెరుగుతూ ఉంది. ఇందులో కలప స్థానాన్ని ఇతర వస్తువులు కొంత మేరకు ఆక్రమించి నప్పటికీ కలప అవసరం మొత్తం మీద వేగంగా పెరుగుతూ ఉంది. అదేవిధంగా విద్యారంగం విస్తరించే కొద్దీ కాగితం ఉత్పత్తి పెరుగుతూ ఉంది. దానికి వెదురు కావాలి. ఈ అవసరాలు ఒక పక్క పెరుగుతుండగా, అడవులన్నీ నిండుగా ఉంటేనే, గిరిజనులకు గడ్డీగాదం సమృద్ధిగా ఉంటేనే మీ ఫ్యాక్టరీలకూ, మీ కట్టె కోత మిల్లులకూ, మీ టింబర్ డిపోలకూ కలప ఇస్తాం అని ప్రభుత్వం అంటుందా? అనలేకపోతే ఏం చేస్తుంది? అటవీ భూభాగం విస్తీర్ణాన్ని దెబ్బతినవిస్తుందా, లేకపోతే ఆదివాసుల ప్రయోజనాలను దెబ్బ తీస్తుందా?

ఇటువంటి అన్ని అనుమానాలకూ కాకున్నా కొన్నిటికి జవాబు ఈ కొత్త అటవీ విధానానికి క్రియారూపం ఇచ్చే శాసనం ముసాయిదానుపరిశీలిస్తే దొరుకుతుంది. ఈ శాసనం త్వరలో పార్లమెంటు ఆమోదం పొందబోతుంది. 1927 నుండి అమలులో ఉన్న భారత అటవీచట్టం స్థానాన్ని ఇది ఆక్రమిస్తుంది. దీనిపేరు 'అడవులు, ప్రకృతిసిద్ధమైన పర్యావరణ వ్యవస్థల పరిరక్షణ చట్టం' అడవుల వంటి ప్రకృతి సహజమయిన పర్యావరణ వ్యవస్థలను (ఈకోసిస్టెమ్స్) పరిరక్షించడమే ఇక మీదట అటవీ విధానంగా ఉండబోతుందని ఈ పేరే చెప్తుంది. మరి పర్యావరణ ఉద్యమం రంగు ఆకుపచ్చ కాబట్టి ఇకమీద ఫారెస్ట్ రేంజర్లకు ఖాకీ యూనిఫారాలు తీసేసి ఆకుపచ్చ యూనిఫారాలు ఇస్తారేమో చూడాలి. !!

ఈ మాటలు వెక్కిరింతగా అనడంలేదు. ప్రజోద్యమాల ఒత్తిడికి స్పందించి (లేకపోతే లొంగి) ప్రభుత్వం తన విధానాలను సంస్కరించుకుంటే అది హర్షించదగ్గ విషయమే. నిజానికి ప్రజాస్వామ్యంలో కోరుకునేది అదే.కానీ ఆ స్పందన వాస్తవంలో ఏ రూపం తీసుకుంటుందో పరిశీలించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు అటవీశాఖ యూనిఫారం ఖాకీ యూనిఫారమేకాక, దాని సంస్కృతి, పనితీరు పోలీసు శాఖను తలపించేవే. అటవీ విధానం (పైకి ఏం చెప్పుకున్నా) ఆచరణలో పెట్టుబడిదార్లకు ఊడిగం చేసి ప్రజలను (ముఖ్యంగా ఆదివాసీలను) అణచివేసే విధానం. ఇప్పుడు పర్యావరణాన్ని కాపాడడం కోసం పెట్టుబడిదార్లకు ఊడిగం చేసే వైఖరిని తగ్గించుకోవచ్చు. అదే క్రమంలో స్థానిక ప్రజలమీద నిర్బంధం కూడ పెరుగుతుందేమోనని భయపడ నవసరం లేదనీ, స్థానిక ప్రజలకు అడవుల వల్ల ఉండే ప్రయోజనాలను కాపాడడం పర్యావరణ సంరక్షణతో సమంగా ప్రభుత్వ లక్ష్యంగా ఉంటుందనీ ప్రభుత్వం మనకు చెప్పదలచుకుంది. కానీ ఈ కొత్త విధానాన్ని అమలు చేయడానికి ఏ వ్యవస్థాగత నిర్మాణం, వియమాలు రూపొందిస్తారో చూస్తే తప్ప ఈ రెండు లక్ష్యాల మధ్య ఉండగల వైరుధ్యాన్నీ, నూతన అటవీ విధానానికీ దేశంలోని ఆర్థిక వ్యవస్థకూ మధ్య ఉండే వైరుధ్యాన్నీ ఏ విధంగా పరిష్కరిస్తారో అర్థం కాదు.

వ్యవస్థాగత నిర్మాణంలో మొదటి విషయం పైన పేర్కొన్న కొత్త అటవీచట్టం. అది ఇప్పటికింకా ముసాయిదా రూపంలోనే ఉంది కాబట్టి దీనిని ప్రజాస్వామిక దృక్పథంతో విమర్శనాత్మకంగా పరిశీలిస్తే అది చట్టరూపం తీసుకునే నాటికి కొంతమేరకయినా లోపాలను తొలగించే ప్రయత్నం చేయవచ్చు.

రిజర్వ్ అడవులు, రక్షిత అడవులు, గ్రామీణవనాలు అనే విభజనను కొత్త అటవీచట్టం కొనసాగిస్తుంది. రిజర్వ్ అడవులు, రక్షిత అడవులు అటవీ సంరక్షణ కోసం ఉద్దేశించబడినవి. వాటిలో ప్రజలకు హక్కులు చాలా స్వల్పంగా ఉంటాయి. ప్రభుత్వం అనుమతించిన మేరకే ఉంటాయి. ప్రజల అవసరాల కోసం కేటాయించినవి గ్రామీణ వనాలు. గ్రామీణవనం వల్ల ప్రయోజనం పొందేవారికి రిజర్వ్ అడవులలో, రక్షిత అడవులలో అటవీ ఉత్పత్తులను పొందే హక్కు ఉండదు.

నిజానికి 'రక్షిత' (ప్రొటెక్టెడ్) అడవి అనేది కేవలం ఒక తాత్కాలిక ఏర్పాటు. అడవులన్నీ రిజర్వ్ అడవులు, లేకపోతే గ్రామీణ వనాలు. రిజర్వ్ అడవిగాను గ్రామీణవనంగాను ప్రభుత్వం ప్రకటించవలసి ఉండి, ఏదయినా ఒక కారణంవల్ల ప్రకటించలేకపోతే,అప్పుడు నష్టాన్ని నివారించడానికి దానిని రక్షితవనంగా ప్రకటిస్తుంది.

ఈ వర్గీకరణలో కీలకమైనది రిజర్వ్ అడవి. దేశంలో అడవీభూభాగం సమృద్ధిగా ఉండాలి, పర్యావరణం పరిరక్షించబడాలి అనే లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రప్రభుత్వం తన యాజమాన్యంలో ఉన్న ఏ భూభాగాన్నయినా, లేక తనకు ఏవయినా యాజమాన్య హక్కులున్న ఏ భూభాగాన్నయినా రిజర్వ్ అడవిగా ప్రకటించవచ్చు. అటువంటి ఒక భూభాగాన్ని రిజర్వ్ అడవిగా ప్రకటించవలసిన అవసరం ఉండి కూడ రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకొని ఆ భూభాగాన్ని రిజర్వ్ అడవిగా ప్రకటించమని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించవచ్చు. అప్పుడు ఆ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఆదేశాన్ని పాటించవలసిందే.

ఈ విధంగా రిజర్వ్ అడవిగా ప్రకటించిన భూభాగంలో అప్పటికి ప్రజలలో ఎందరికో హక్కులు ఉండి ఉంటాయి. వాళ్ల హక్కులు ఏమవుతాయి? వీటిని తీర్మానించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌నునియమిస్తుంది. ఇతను పరిసర గ్రామాలలోని ప్రజలకు ఫలాన భూభాగం రిజర్వ్ అడవిగా ప్రకటించబడిందనీ, అందులో అప్పటిదాకా హక్కులు అనుభవించినవారు తమ హక్కులేమిటో తెలియ జేయాలనీ. స్థానిక భాషలో ప్రకటిస్తాడు. అర్జీలు ఇవ్వడానికి ఒక గడువు నిర్ణయిస్తాడు. అడవుల దగ్గర నివసించేది ఎక్కువగా ఆదివాసీలు కాబట్టి, వాళ్లలో ఎక్కువమంది నిరక్షరాస్యులు కాబట్టి, ఏ వకీలుకో గ్రామకరణానికో డబ్బులిచ్చి అర్జీలు రాయించుకోలేక పోవచ్చు కాబట్టి, 'స్థానిక భాష' అని పిలవ బడే మెజారిటీ ప్రజల భాష వాళ్లలో చాలామందికి తెలియక పోవచ్చు కాబట్టి, చాలా మంది హక్కుదారులు సకాలంలో అర్జీలు పెట్టుకోక పోవచ్చు. అటువంటి వారి హక్కులన్నీ అంతరించి పోతాయని సెక్షన్ 9 అంటోంది.

ఇంక అర్జీలు పెట్టుకున్న వారి సంగతి చూద్దాం. ఈ హక్కులలో మూడు రకాలుంటాయి. భూమి మీద యాజమాన్యం హక్కు ఒకటి. పోడువ్యవసాయం చేసుకునే హక్కు రెండవది .అడవిలో పశువులు మేసుకునే హక్కు, అడవి వాగులలో నీళ్లు తెచ్చుకునే హక్కు, అడవి మార్గంలో నడిచే హక్కు మూడవ కోవకు చెందినవి.

ఈ కొత్త విధానాన్ని అమలు చేయడానికి ఏ వ్యవస్థాగత నిర్మాణం, వియమాలు రూపొందిస్తారో చూస్తే తప్ప ఈ రెండు లక్ష్యాల మధ్య ఉండగల వైరుధ్యాన్నీ, నూతన అటవీ విధానానికీ దేశంలోని ఆర్థిక వ్యవస్థకూ మధ్య ఉండే వైరుధ్యాన్నీ ఏ విధంగా పరిష్కరిస్తారో అర్థం కాదు.

వీటి గురించి అర్జీపెట్టుకోగల వాళ్లు పెట్టుకున్న అర్జీల మీద సెటిల్‌మెంట్ అధికారి తన తీర్పు ఇస్తాడు. అర్జీని ఆమోదించవచ్చు (అంటే ఆ హక్కు ఉండిందని ఒప్పుకోవచ్చు) లేదా తిరస్కరించవచ్చు. తిరస్కరిస్తే అక్కడితో కథ అయిపోయినట్టే (జిల్లా కోర్టుకు, హైకోర్టుకు అప్పీల్ చేసుకోవచ్చుననుకోండి, కానీ అటవీవాసులలో ఎంతమందికి అది సాధ్యం అవుతుంది?)

అర్జీని ఆమోదించిన పక్షంలో, ఆ హక్కుకు సెటిల్‌మెంట్ అధికారి ఏదో ఒక సర్దుబాటు చేస్తాడు. పోడువ్యవసాయాన్ని లెక్కలోకి తీసుకోవాలంటే అది 25 సంవత్సరాలుగా అక్కడ జరుగుతూ ఉండాలి. 25 సంవత్సరాలుగా జరుగుతున్నదా లేదా, ఏ భూభాగంలో జరుగుతున్నది అనే విషయాలను సెటిల్‌మెంట్ అధికారి రికార్డుచేసి ప్రభుత్వానికి తెలియజేస్తాడు. అప్పుడు ప్రభుత్వం దానిని మొత్తంగా గానీ పాక్షికంగాగాని నిషేధించవచ్చు. నిషేధించ బడిన భూభాగంలో పోడు వ్యవసాయం చేసుకుంటున్న ప్రజలు 3 సంవత్సరాల లోపు నిషేధాన్ని అమలు చేయవలసి ఉంటుంది. వాళ్లకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ జీవనాధారాన్ని (అది వ్యవసాయ భూమికానవసరం లేదు) చూపిస్తుంది. ఆమోదించిన భూభాగాన్ని రిజర్వ్ అటవినుండి తొలగిస్తారు. అయితే పోడు వ్యవసాయాన్ని వీలయినంత వరకు తగ్గించాలనేది ప్రభుత్వ అటవీ విధానం కాబట్టి ఎక్కువ భాగం 'ప్రత్యామ్నాయ జీవనాధారం' అని

పిలవబడేదేదో చూపించి నిషేధించడమే జరుగుతుంది.

ఇక పోడువ్యవసాయం కాక, ప్రకటిత భూమిలో యాజమాన్య హక్కు ఎవరికయినా ఉన్నట్టు సెటిల్‌మెంట్ అధికారి అంగీకరిస్తే, ఆ భూమిని ప్రభుత్వం భూసేకరణ చట్టం కింద నష్ట పరిహారం ఇచ్చి స్వాధీనం తేసుకుంటుంది. ఆ రైతులు భూమి వదులుకొని నష్టపరిహారం తీసుకొని వెళ్ళిపోవలసిందే.

ఇంక మూడవ హక్కు పశుగ్రాసం, వంటచెరకు, అడవిమార్గాల వినియోగం, అడవిలో నీటి వనరుల వినియోగం మొదలయిన వాటికి సంబంధించినది. వీటి కోసమే గ్రామీణ వనాలు అనేవి ఉద్దేశ్యించబడ్డాయి కాబట్టి ఈ హక్కులను రిజర్వ్ అడవులలో ఎక్కువగా ఇవ్వరు. అప్పటికే ఏదయినా గ్రామీణవనంలో హక్కులున్న వాళ్ళకు రిజర్వ్ అడవిలో ఉన్న హక్కులు అంతరించి పోతాయి. అదేవిధంగా,ఒక రిజర్వ్ అడవిని అనుకొని ఉన్న గ్రామానికి చెందినవారు కాక దూరంగా ఉండేవాళ్ళకు కూడ రిజర్వు అడవిని ప్రకటించిన తరువాత అందులో అంతకుముందున్న హక్కులన్నీ పోతాయి. రిజర్వ్ అడవిని అనుకొని ఉండి, గ్రామీణవనం లేని గ్రామానికి చెందిన వారికి మాత్రమే ఈ మూడవకోవకు చెందిన హక్కులు దక్కుతాయి. అది కూడ ఏమేరకు ఉంటాయంటే ఆ అడవి'భరించగల' మేరకు మాత్రమే. అది ఏమేరకు 'భరించగలదు' అనే విషయం ప్రభుత్వం అంచనావేసి ఒక్కొక్క హక్కుదారు ఎన్ని పశువులను మేపుకోవచ్చు, ఎంతగడ్డి కోసుకోవచ్చు, రోజులో ఏయే సమయంలో అడవి మార్గాలను రాకపోకల కోసం ఉపయోగించుకోవచ్చు అనే విషయాలు నిర్ణయించి ఆ మేరకు ఒక్కొక్కరికి హక్కులు కల్పిస్తుంది. ఉదాహరణకు అడవి మార్గంలో ప్రయాణించే హక్కు కల్పిస్తే ప్రజలు అటవీసంపదను దొంగిలిస్తారని అనుమానిస్తే, సెంట్రీ ఉన్నప్పుడు మాత్రమే అడవి మార్గంలో ప్రయాణించవచ్చునని నియమం పెట్టవచ్చు. సెంట్రీ లేని సమయంలో ప్రజలు అడవిని చుట్టిపోవలసిందే.

పొరుగు గ్రామానికి చెందిన వారు కాని వారికి రిజర్వ్ అడవిగా ప్రకటించిన భూభాగంలో గతంలో ఉన్న హక్కులన్నీ అంతరించి పోతాయనడం మరొక అన్యాయం. పశుగ్రాసం కోసం, నాగలి కర్ర కోసం, ఇంటి దూలాలకోసం దూరప్రాంతాల వాళ్లు కూడా అడవికి పోతుంటారు. వాళ్లందరి హక్కులను ఈ చట్టం ఒక్క దెబ్బతో తిరస్కరిస్తుంది.

ఇదంతా అప్పటికే ఉన్న హక్కులకు సంబంధించినది. రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించిన తరువాత కొత్తగా అందులో ప్రజలకు హక్కులు వుట్టడం దాదాపు అసాధ్యం. ఆ అడవి 'భరించగలదు' అనుకున్న మేరకు రాష్ట్రప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన వ్యక్తులకు మాత్రమే రిజర్వ్ అడవిలో పశువులను మేపుకునే హక్కయినా, వెిండుపుల్లలు ఏరుకునే హక్కయినా కొత్తగా రావాలి. నిజానికి గతకాలపు హక్కులుగా ప్రభుత్వం గుర్తించి ఆమోదించిన వాటికి కూడ నగదు రూపంలో వెలకట్టి డబ్బులిచ్చి లాగేసుకోవచ్చునని సెక్షన్ 20 అంటుంది. అటవీ సంరక్షణ దృష్ట్యా, గుర్తించిన హక్కును తొలగించవచ్చునని సెక్షన్ 76 అంటుంది.

పొరుగు గ్రామానికి చెందిన వారు కాని వారికి రిజర్వ్ అడవిగా ప్రకటించిన భూభాగంలో గతంలో ఉన్న హక్కులన్నీ అంతరించి పోతాయనడం మరొక అన్యాయం. పశుగ్రాసం కోసం, నాగలి కర్ర కోసం, ఇంటి దూలాలకోసం దూరప్రాంతాల వాళ్లు కూడా అడవికి పోతుంటారు. వాళ్లందరి హక్కులను ఈ చట్టం ఒక్క దెబ్బతో తిరస్కరిస్తుంది.

భూమి మాటకొస్తే, రిజర్వ్ అడవిలో సాగుభూమికిగానీ వ్యవసాయ భూమికిగానీ పట్టాలు ఇవ్వరాదు. లీజుకు ఇయ్యవచ్చు. కానీ కేంద్రప్రభుత్వం అనుమతి లేకుండా రాష్ట్రప్రభుత్వం అడవి భూమిని ఎవ్వరికీ లీజుకు ఇవ్వడానికి వీలులేదు. కేంద్రప్రభుత్వం అనుమతి తెచ్చుకోవడం మామూలు రైతులకు సాధ్యమయ్యేది కాదు కాబట్టి ఈ 'లీజు' సదుపాయం పెట్టుబడి దార్ల ప్లాంటేషన్ల కోసం ఉద్దేశ్యించబడిందనేది స్పష్టమే.

మరి రిజర్వ్ అడవిలో ప్రజలు చెట్లు కొట్టుకొని భూమిసాగు చేసుకున్నారనుకోండి, వాళ్లకు పట్టాలు కావాలంటే ఏంచేయాలి? పట్టాలు ఎట్టి పరిస్థితిలోనూ ఇవ్వడానికి వీలులేదు. కాబట్టి ఒకటేమార్గం రిజర్వ్ అయిన అడవిని 'డీ-రిజర్వ్' చేయడం. అయితే ఈ అధికారం కూడ రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. సెక్షన్ 27(1) ప్రకారం కేంద్రప్రభుత్వం అనుమతి లేకుండ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్ అడవిని డీ-రిజర్వ్ చేయడానికి వీలులేదు. పైగా ప్రజలు దున్నుకున్న రిజర్వ్ అడవిని వాళ్లకు పట్టాలు ఇవ్వడం కోసం డీరిజర్వ్ చేస్తారేమోనన్న అనుమానం ఈ బిల్లు ముసాయిదా రచయితలకు ఉన్నట్టుంది. అందువల్ల 'ఒక భూభాగాన్ని రిజర్వ్ అడవిగా ప్రకటించిన తదుపరి దానిని ఆక్రమించుకున్నవారికి పట్టాలు ఇవ్వటం కోసమే డీరిజర్వ్ చేసేటట్టయితే, పార్లమెంటు ఉభయసభలూ ఈ చర్యను ఆమోదిస్తూ తీర్మానం చేసినట్టయితేనే ఆపనిచేయవచ్చు' అని సెక్షన్ 27(1) స్పష్టంచేస్తుంది! ఉదాహరణకు ఏ బూర్గుంపాడులోనో ఒక ఊరిలోని కోయలు 100 ఎకరాల రిజర్వ్ అడవిని కొట్టి సాగు చేసుకుంటే వాళ్ళకు పట్టా ఇవ్వాలంటే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వాన్ని అడిగి, కేంద్రప్రభుత్వం పార్లమెంటు ఉభయసభలలో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదం పొందవలసి ఉంటుంది!

ఆదివాసులయినా ఇతర పేదప్రజలయినా అడవులలో పట్టాపొందకుండ ఇంతగా కట్టుదిట్టం చేసారు.

మరి పెట్టుబడిదార్ల సంగతి? వాళ్లకు కూడ ఇప్పుడు దొరుకుతున్నట్టు విరివిగా కలపదొరకడం కష్టం కావచ్చు. కొత్త అడవీచట్టాన్ని కట్టుదిట్టంగా అమలుచేస్తే కలప స్మగ్లింగ్ కూడ బాగా తగ్గుతుంది. పరిశ్రమలు ఉపయోగించే కలప, విత్తనాలు, ఆకులు మొదలయిన అటవీ సంపద సమృద్ధిగా ఉందని భావిస్తేనే దానిని కొనుక్కునే లైసెన్స్ పారిశ్రామిక అధిపతులకు లభిస్తుంది. అది కూడ కేంద్రప్రభుత్వం అనుమతి లేకుండ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడానికి వీలులేదు. ముడిసరుకు సరఫరా గురించి ఒకసారి ఒప్పందం చేసుకున్న తరువాత, అటవీ సంపద దెబ్బతింటుందని అనుమానం వస్తే ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని నిలిపివేయవచ్చు. లేదా సవరించవచ్చు. కట్టెకోత మిల్లులు ప్రభుత్వం అనుమతి లేకుండా నెలకొల్పడానికి వీలులేదు. కొన్ని ప్రాంతాలలో కోత మిల్లులు నెలకొల్పడాన్ని నిషేధించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుంది.

ఇదంతా పరిశ్రమలపేరిట, వర్తకంపేరిట అటవీ సంపద ధ్వంసం కాకుండ కాపాడటానికి ఉపయోగపడుతుంది. స్మగ్లింగ్‌ను నిరోధిస్తుంది. అయితే అంతమాత్రం చేత వ్యాపార పారిశ్రామిక అవసరాలకు కొత్త చట్టంలో స్థానం లేకపోలేదు. రిజర్వ్ ఫారెస్టులో ప్రభుత్వమే పారిశ్రామిక ముడి సరుకులయిన అటవీ ఉత్పత్తులను పెంచి అమ్మడమేకాక, కేంద్రప్రభుత్వం అనుమతితో రిజర్వ్ అడవులను ప్రైవేట్‌వ్యక్తులకు లీజుకు ఇయ్యవచ్చును. కేంద్రప్రభుత్వం అనుమతిని ఆదివాసీలు, రైతులు పొందలేరు కానీ పెట్టుబడిదార్లకు కష్టం కాదు. బాగా పెంచిన అడవిని మొత్తంగానే డీ రిజర్వ్ చేసి (కేంద్ర ప్రభుత్వం అనుమతితో) పెట్టుబడిదార్లకు అమ్మవచ్చు. లేకపెట్టుబడిదార్లు భూములు కొనుక్కొని ప్లాంటేషన్‌గా రిజిస్టర్ చేసి అడవులు

పెంచుకోవచ్చు. అటువంటి భూమికి సీలింగ్‌చట్టాలు వర్తించవనీ, ఆ భూమిలో పెంచే అడవి విషయంలో ప్రభుత్వం జోక్యం ఉండదనీ, చెట్లు కొట్టేటప్పుడు ఒక నెలరోజులు ముందు డివిజనల్ అటవీ అధికారికి తెలియజేస్తే చాలనీ సెక్షన్‌లు 38 వి 38 డి అంటాయి. పెట్టుబడిదారీ కంపెనీలేకాదు, ఏ రైతయినా చెట్లపెంపకానికి భూమిని కేటాయించి, 'చెట్లపెంపకందారు' (ట్రీగ్రోయర్) గా సెక్షన్ 38 ఎ క్రింద తనను తాను రిజిస్టర్ చేసుకుంటే ఆ భూమి సీలింగ్ చట్టం నుండి మినహాయింపు పొందుతుంది. పైగా అటువంటి రైతులకు అటవీశాఖ నగదురుణం, నిపుణుల సహాయం కల్పిస్తుంది. పెట్టుబడి దారులు ఇటువంటి రైతులను ప్రోత్సహించి వాళ్లతో ముడిసరుకు సరఫరా గురించి ఒప్పందాలు చేసుకుంటే ఉభయతారకంగా ఉంటుంది.

అడవులను ఒకవైపు కాపాడుతూ, మరొకవైపు పెట్టుబడిదారుల ముడిసరుకు అవసరాలకు తగిన ఏర్పాట్లు ఈ చట్టం చేస్తుంది. కానీ భూమిలేని పేదలకు మాత్రం అడవులలో సాగుభూమి దొరకడం ఈ చట్టం ప్రకారం అసాధ్యం అయిపోయింది.

పోనీ, స్థానిక ప్రజలకు అవసరమైన అటవీ ఉత్పత్తులు అందించడం నూతన అటవీ విధానం ముఖ్య లక్ష్యాలలో ఒకటి కదా. దానికి ఈ చట్టం చేసిన ఏర్పాటు ఏమిటి? ఆ ఏర్పాటే గ్రామీణవనాలు అనే మూడవ కోవకు చెందిన అడవులు. ఒక గ్రాహీణ వనాన్ని ఏర్పాటు చేయడం కోసం ప్రభుత్వం తన అధీనంలో ఉన్న భూమిని, తనకు యాజమాన్య హక్కులున్న భూమిని, ఆ గ్రామీణ సమాజానికి యాజమాన్య హక్కులున్న భూమిని కేటాయించవచ్చు. ఆ గ్రామీణవనం నిర్వహణపథకాన్ని అటవీశాఖను సంప్రదించి గ్రామ పంచాయితీ రూపొందిస్తుంది. గ్రామీణవనం నిర్వహణ గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో జరుగుతుంది. అయితే దీనిని ఒక ప్రభుత్వ అధికారి పర్యవేక్షిస్తాడు. గ్రామ పంచాయితీ గ్రామీణవనాన్ని సరిగ్గా నిర్వహించలేక పోతోందని ఆ అధికారి (లేక రాష్ట్ర ప్రభుత్వం) భావిస్తే దానిని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుది.

గ్రామీణవనంలో పశువులను మేపుకోవడం, ఇతర ఉత్పత్తుల వాడకం, గ్రామప్రజలకు దానిలో ఉండే హక్కులు నిర్వహణపథకాన్ని అనుసరించి గ్రామపంచాయితీ చేత నిర్ణయించబడతాయి. గ్రామీణవనంలో కొంత భాగాన్ని గ్రామ పంచాయితీ అటవీకరణ నిమిత్తం ఎవరికయినా లీజుకు కూడ ఇయ్య వచ్చును.

రిజర్వ్ అడవులను పర్యావరణ సంరక్షణకోసం, ప్లాంటేషన్లను పెట్టుబడి దార్లకోసం, గ్రామీణవనాలను ప్రజల అవసరాలకోసం ఈ చట్టం కేటాయించింది. అన్నీ సక్రమంగా ఉంటే - ప్రతీగ్రామంలోనూ ఒక గ్రామీణవనం ఏర్పాటుచేసి ప్రజలకు అడవులతో ఉండే అవసరాలన్నీ రిజర్వ్‌ఫారెస్ట్ జోలికి పోకుండా తీర్చగలిగితే - ఇది మంచి ఏర్పాటే. కానీ గ్రామీణవనాలకు భూములు ఎక్కడి నుండి రావాలి? గ్రామీణ సమాజం ఉమ్మడి యాజమాన్యంలో ఉన్న భూమి ఎక్కడోగానీ లేదు. అదిపోతే రిజర్వ్ అడవులకైనా, ప్లాంటేషన్లకయినా, గ్రామీణవనాలకయినా భూమి ఒక చోటనుండే రావాలి. అది ప్రభుత్వ యాజమాన్యంలోని భూమి, లేదా ప్రభుత్వానికి యాజమాన్య హక్కులున్న భూమి. ఈ భూమినే మూడు అవసరాలకు కేటాయించాలి. అడవి బాగా పెరిగే భూమిని రిజర్వ్ అడవులకు కేటాయించి, పెట్టుబడిపెడితే బాగా చేసుకోగల భూమిని ప్లాంటేషన్లకు లీజుకిచ్చి,చవుడు భూములు బంజరు భూములు ఇసుకనేలలు గ్రామీణ వనాలకు కేటాయించడం జరగదని ఈ చట్టం హామీ ఇస్తుందా? నిజానికి అడవులు బాగా పెరగగల భూమి యావత్తు ఇప్పటికే అధికభాగం రిజర్వ్ ఫారెస్టుకింద ఉంది. ఒకసారి రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటించిన దానిని గ్రామీణ వనాల కోసం కేటాయించకూడదని ఈ ముసాయిదాలోని సెక్షన్ 34 ఎఎ స్పష్టం చేస్తుంది. మరి ఇంక గ్రామీణ వనాలు నెలకొల్పడానికి మిగిలిన భూమి ఏది? బంజర్లు, చవుడు నేలలు, ఇసుకనేలలు, రాతినేలలు. వీటిలో పెంచేగ్రామీణవనాలు ప్రజల అవసరాలకు సరిపోతాయా? పశుగ్రాసం, వంటచెరుకు, నాగలికీ గృహోపకరణాలకూ అవసరమయ్యే కర్ర, దూలాలకు కావల్సిన కలప, అన్నీ దొరుకుతాయా?

మరి అడవులు పెంచి పర్యావరణాన్ని కాపాడనవసరం లేదా అంటే అవసరమే. పరిశ్రమలకు అటవీ ఉత్తత్తులు అవసరంకాదా అంటే అవసరమే. మరయితే ఏంచేయాలంటే ముందు అడవులకు ప్రజలను శత్రువులుగా చూడడం మానేయాలి.

పైగా ఈ భూమిలో అధికభాగం ఇప్పటికే చాలా మంది పేదలకు ఉపయోగపడుతూ ఉంది. పట్టాలు లేకుండా పేదలు సేద్యం చేసుకుంటున్నారు. మత్స్యకారులు వలలు ఆరేసుకుంటున్నారు. ఇళ్లస్థలాలు లేనివాళ్లు గుడిసెలు వేసుకుంటున్నారు, ఇంకా ఎన్నో రకాలుగా ఉపయోగించుకుంటున్నారు. ఈ ప్రయోజనాలు ఏంకావాలి?

మరి అడవులు పెంచి పర్యావరణాన్ని కాపాడనవసరం లేదా అంటే అవసరమే. పరిశ్రమలకు అటవీ ఉత్పత్తులు అవసరంకాదా అంటే అవసరమే. మరయితే ఏంచేయాలంటే ముందు అడవులకు ప్రజలను శత్రువులుగా చూడడం మానేయాలి. అడవుల పెంపకం ప్రజలను వెలివేసిన రిజర్వ్ అడవులలోనే జరగవలసిన అక్కరలేదు. అటవీశాఖ, రైతులు సంయుక్తంగా అడవులను పెంచవచ్చును, కాపాడవచ్చును. ఈ సంయుక్త అటవీ యాజమాన్య (జాయింట్ ఫారెస్ట్ మేనేజిమెంట్) ప్రయోగం పశ్చిమ బెంగాల్‌లో బాగా విజయవంతమయింది. 1988 అటవీ విధానంలో అడవులకు ప్రజలను శత్రువులుగా చూడకూడదన్న స్పృహ స్పష్టంగా కనిపిస్తుంది కానీ దానికి నిర్మాణరూపం ఇచ్చే ఈ ముసాయిదా చట్టంలో మళ్లీ పాతవైఖరే ఉంది.

రెండవది, అడవుల సంరక్షణ అనేది మైదానాలలో భూసంస్కరణల అమలునుండి వేరుచేసి నిర్వహించగల కర్తవ్యం కాదు. సీలింగ్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి మిగులు భూములు వ్యవసాయానికి యోగ్యమైతే పేదలకు పంచడం, అడవుల పెంపకానికి యోగ్యమయితే గ్రామీణ వనాలకోసం కేటాయించడం అవసరం. అది జరగకుండా గ్రామ బంజర్లలో గ్రామవనాలు నెలకొల్పి గ్రామపెత్తందార్ల అజమాయిషీలో ఉన్న పంచాయితీలకు అప్పజెప్పి ఆ వనాల ఉత్పత్తిని ఏవిధంగా వినియోగించుకోవాలో నిర్ణయించే అధికారం, ఆ భూమిని ప్లాంటేషన్ల కోసం లీజుకు ఇచ్చే అధికారం పంచాయితీలకు ఇస్తే పేదల గతి ఏంకావాలి?

రిజర్వ్ అడవులలో పాతహక్కులను బాగా పరిమితంచేసి, అవసరమయితే వాటికి నగదువెలకట్టి కొనేసి,కొత్త హక్కులు పుట్టడం అసాధ్యం చేసి, దీనిని అమలు చేయడానికి అటవీ అధికారులకు ఇళ్లను సోదా చేసే అధికారాలు, వస్తువులను, పశువులను జప్తుచేసే అధికారాలు విస్తృతంగా కట్టబెట్టారు. ఆదివాసీలూ, అడవుల పరిసరాలలో నివసించే ఇతర ప్రజలూ ఏంకావాలి? ప్రజలకు భాగస్వామ్యం కల్పించే ఉమ్మడి అటవీ యాజమాన్య ప్రయోగం పశ్చిమ బెంగాల్‌లో బాగా విజయవంతం అయిందని అధికార యంత్రాంగమే ఒప్పుకుంటూఉంది. మరి దానికి కొత్త అటవీ చట్టంలో చోటెందుకు లేదు?